వైఎస్సార్ సీపీలో చేరికలు

పట్నంబజారు: నగరంలోని 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కల మారుతి, కోటి లింగారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నేత గురుబ్రహ్మాచారి నేతృత్వంలో టీడీపీ, బీజేపీకి చెందిన పలువురు కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. బృందావన్ గార్డెన్స్‌లోని విప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తదితరులతో కలసి శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కురుక్షేత్రానికి సమయం ఆసన్నమైందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలే పునాదిగా.. ఒకే మాటగా.. ఒకే బాటగా.. ఇక కదన రంగంలో దూకడమే మనందరి ముందున్న తక్షణ కర్తవ్యమని చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ పేదల పక్షాన ఒంటరి పోరాటానికి సిద్ధమైన సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు మాట్లాడుతూ సీఎంగా వై.ఎస్. జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ప్రజలతో పాటు అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ పాల్గొన్నారు.





సగర్వంగా సమరభేరి

- మన నాయకుడు చెప్పిందే చేస్తారు
- పాలనతో కార్యకర్తల పరపతిని పెంచారు
- ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం


తూర్పు నియోజకవర్గ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): 'మన నాయకుడు చెప్పిందే చేస్తారు.. చేసేదే చెప్తారు.. మన అధినేత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధే తిరిగి మనలను విజయతీరాన్ని చేరుస్తుంది, కార్యకర్తలు సగర్వంగా సమరభేరి పూరిద్దామని' అని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. పొన్నూరు రోడ్డులోని ఏఆర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం '' ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి'' అనే కార్యక్రమంపై తూర్పు నియోజకవర్గస్థాయి ముఖ్యనేతల సమావేశం జరిగింది. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా సమావేశానికి అధ్యక్షత వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందన్నారు. కార్యకర్తల పరపతిని పెంచుతూ.. ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలమని సగర్వంగా చెప్పుకునేలా జగనన్న పాలన అందించారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతి ఒక్క కార్యకర్త సమరోత్సాహంతో ముందుకు సాగాలన్నారు. రానున్న మరో 30 ఏళ్లు వైఎస్సార్ సీపీనే అధికారంలో ఉండబోతుందని స్పష్టం చేశారు. నవంబర్ 4న గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జరిగే సామాజిక సాధికారిత బస్సు యాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కార్యకర్తలే వెన్నెముక

ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ నవంబర్ 4న జరిగే బస్సుయాత్ర ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందని, దీన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలిపారు. వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే వెన్నెముకని, ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం మన సొంతమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ప్రతిపక్షాల కుట్రలు, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మేలులను ప్రజలకు వివరించాలన్నారు. ఎటువంటి పక్షపాతం లేకుండా ప్రతిపక్షాల నేతలు, కార్యకర్తలకూ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు.

సమరానికి సిద్ధం అవుదాం

నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నగరంలో రూ.200 కోట్ల పైచిలుక అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబాన్ని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు.

జనసేన వల్లే కాపుల వెనుకబాటు

కాపు కార్పొరేషన్ చైర్మన్, తూర్పు నియోజకవర్గ పరిశీలకులు అడపా శేషు మాట్లాడుతూ కాపులంతా సీఎం వైఎస్ జగన్ వెనుక ఉన్నారని స్పష్టం చేశారు. జనసేన వల్లే కాపులు వెనుకబాటుకు గురవుతున్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు తన వాళ్లు అని సగర్వంగా చెప్పిన నాయకుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నవంబర్ 4న జరిగే సామాజిక సాధికారిత బస్సు యాత్ర సభను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, డెప్యూటీ మేయర్ షేక్ సజిల, రిటైర్డ్ ఎస్పీ చెన్నంశెట్టి చక్రపాణి, పార్టీ నేతలు కర్నుమా, వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఆర్. అగ్రహారం శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో..


గంటలమ్మ చెట్టు వీధి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో..


బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో


అరండల్‌పేట అష్టలక్ష్మీ ఆలయంలో దుర్గాదేవిగా..

జయ..జయహే మహిషాసుర మర్దిని !

నగరంలో శ్రీ దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పలు ఆలయాల్లో ఆదివారం అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అన్నసమారాధనలు నిర్వహించారు.

– పాత గుంటూరు

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: 54వ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ షకీనా ప్రార్థన మందిరం వీధిలో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణానికి ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 20లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మల్లవరపు రమ్య, వైఎస్సార్ సీపీ నేతలు అగ్గిపెట్టె రాజు, దాస్, 15వ డివిజన్ కార్పొరేటర్ రామనబోయిన అజయ్‌యాదవ్, రవిరాజా పాల్గొన్నారు.









నేడు నగరపాలక సంస్థలో స్పందన రద్దు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని దసరా పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర ప్రజలకు ఆమె దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

వృద్ధులకు బియ్యం, నిత్యావసర కిట్ల పంపిణీ

నగరంపాలెం: వృద్ధులు, దివ్యాంగుల్ని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. కొత్తపేటలోని కార్యాలయంలో ఆదివారం యాభై మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర కిట్లతో పాటు మహిళలకు చీరల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం వల్ల కలిగే సంతృప్తి ఎనలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరి శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, ఎస్.విజయలక్ష్మి, తాటికోల పద్మావతి పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం


కోదండపాణి, పద్మావతిని సత్కరిస్తున్న ఆర్య సమాజం సభ్యులు

పాత గుంటూరు: అరండల్‌పేట ఆర్య సమాజం ప్రాంగణంలో పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైదిక ధర్మ ప్రచారకులు డాక్టర్ కొసరాజు రవీంద్ర, మాగం కృష్ణమూర్తి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి. కామేశ్వరరావు, ప్రచారకులు నాగభైరవ గంగా పార్వతి, కూరపాటి కల్యాణి రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం వైదిక ధర్మ ప్రచారకులు జి. కోదండ పాణికి ఆర్య పురుష బిరుదు, ప్రొద్దుటూరు ఆర్య సమాజం నిర్వాహకురాలు బి. పద్మావతికి ఆర్యమాత బిరుదు, నగదు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్య సమాజం అధ్యక్షురాలు గుర్రం నిర్మలాదేవి, వ్యవస్థాపక కార్యదర్శి ఏలూరి సూర్యనారాయణ, కార్యదర్శి వాసిరెడ్డి శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.







దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం

గుంటూరు రూరల్: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం చేస్తోందని కల్నల్ నీరజ్ కుమార్ పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో పదో ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ ఏటీసీ ఐదో క్యాంపు శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభించారు. వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. కల్నల్ మాట్లాడుతూ క్యాంపులో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఫైరింగ్, డ్రిల్, టగ్‌ఆఫ్‌వార్, వాలీ బాల్, అథ్లెటిక్స్, రన్నింగ్, క్రీడా సాంస్కృతిక విభాగాల్లో శిక్షణను అందజేస్తూ దేశ రక్షణపై అవగాహనా, దేశభక్తి, జాతీయగీతం ఆవశ్యకతను తెలియజేయడం జరుగుతుందని చెప్పారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

